సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 4 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసలు
ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు పి. గురుస్వామి ఆధ్వర్యంలో పలు కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
కడప	: 6.31	4.54
పులివెందుల	: 6.34	4.49
ప్రొద్దుటూరు	: 6.33	4.58

గరిష్ఠం/కనిష్ఠం
42.2 /25.4

వాతావరణం
జిల్లాలో బుధవారం 25.4 – 42.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు శిక్షణ
కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు ఆర్‌సెటి డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల లోపు కలిగిన యువతకు 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు.వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 22 నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు
వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు పొందడానికి దరఖాస్తు స్వీకరణ గడువును ఈనెల 4వ తేదీతో ముగియనుంది. ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 8వ తేదీ వరకు ఉందని, విద్యార్థుల అభ్యర్థన మేరకు విశ్వవిద్యాలయ అధికారులు రెండు దఫాలు తేదీలను పొడిగించినట్లు వైవీయూ అధికారులు తెలిపారు. వివిధ డిగ్రీల పట్టాల కోసం 11,725 మంది విద్యార్థులు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

వైవీయూ కామర్స్ డీన్‌గా ఆచార్య సుబ్బరాయుడు



ఆచార్య వై. సుబ్బరాయుడుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా ఎంబీఏ ఆచార్యులు ఆచార్య వై. సుబ్బరాయుడును నియమితులయ్యారు. ఈయనకు నియామక పత్రాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన ఆచార్య టి. శ్రీనివాస్ పదవీకాలం పూర్తవడంతో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. నూతన డీన్‌గా నియమితులైన ఆచార్య సుబ్బరాయుడు మూడు సంవత్సరాల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు.

ఎడెక్స్ కోర్సులో నమోదుకు స్పందన
వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని ఎడెక్స్ అందించే కోర్సులలో నమోదు కేంద్రాన్ని (లైసెన్స్ యాక్టివేషన్ అండ్ కోర్సెస్ ఎన్‌రోల్‌మెంట్ హెల్ప్‌లైన్ సెంటర్)ను ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి పరిశీలించారు. బుధవారం విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఈ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సుల్లో 400 మంది ఫ్యాకల్టీ, విద్యార్థులు వారి పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. కోర్సులో చేరడం ద్వారా ప్రపంచంలో ప్రముఖ యూనివర్సిటీల ఫ్యాకల్టీల లెక్చర్స్ వీడియోలు చూడటంతో పాటు మెటీరియల్స్‌ను విద్యార్థులు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈయన వెంట ఎడెక్స్ ప్రోగ్రాం కోర్సు కోఆర్డినేటర్ కె. శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి బి. రెడ్డయ్య ఉన్నారు.


ముగిసిన ఇంటర్ మూల్యాంకనం
కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గత నెల 9వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్ సమాధాన పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3వ తేదీ బుధవారంతో ముగిసిందని ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 1,84,907 సమాధాన పత్రాలు మూల్యాంకనం కోసం కడపకు వచ్చాయన్నారు. వీటిన్నింటికి మూల్యాంకనాన్ని ఇన్‌టైమ్‌లో పూర్తి చేసి మూల్యాంకన ముగింపులో రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచామని ఆయన తెలిపారు. మూల్యాంకనం విజయవంతంగా ముగిసేందుకు సహకరించిన జిల్లా అధికారులతోపాటు ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, నాన్‌టీచింగ్ అందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రేపటి నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు



రాజంపేట: ఈనెల 5 నుంచి 8వరకు పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 521వ వర్ధంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. తాళ్లపాక, అన్నమాచార్య 108 అడుగుల విగ్రహం వద్ద టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. తాళ్లపాకలో 5న అన్నమాచార్య ధ్యానమందిరంలో సంకీర్తనా గోష్టిగానం ఉంటుంది. టీటీడీ కళాకారులచే సంగీత కార్యక్రమాలు ఉంటాయి.

ఎంతపని చేశావ్.. బాబూ





ఈ వృద్ధురాలి పేరు నారాయణమ్మ, కడప నగరం రాజారెడ్డి వీధిలో నివసిస్తోంది. మిట్ట మధ్యాహ్నం మండుటెండల్లో ఒక టవల్‌ను నెత్తి మీద వేసుకొని పింఛన్ కోసం ఆయాసపడుతూ సచివాలయానికి వచ్చింది. వలంటీర్‌లు ఇళ్లకాడికి పోకూడదని ఎవరో చెప్పారంట. ఇదేమి చోద్యమో నాయనా....ముసలోళ్లకు సాయం చేస్తే తప్పా. ఇలా ఎండలో రావడం చాలా కష్టంగా ఉందని నారాయణ వాపోయింది.



పాత ప్రగతి భవన్‌లో ఉన్న సచివాలయాల సముదాయాలకు పింఛన్ల కోసం వచ్చిన లబ్ధిదారులు



ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారకముందే ఇంటి తలుపు తట్టి వలంటీర్లు అవ్వాతాతలకు పింఛన్లు అందజేసేవారు. పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా పెట్టాలంటూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలు వృద్ధుల పాలిట శాపంగా పరిణమించాయి. ఇంటికి.. మంచానికి పరిమితమైన పండుటాకులు పింఛన్ కోసం మండుటెండలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి రావడం ఆందోళన కలిగిస్తోంది. పింఛన్ కోసం వారు పడుతున్న కష్టాలను చూసిన ప్రతి ఒక్కరూ పాపం.. పండుటాకులు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పింఛన్ కోసం మండుటెండల్లో సచివాలయాలకు తరలిన పండుటాకులు
- అప్పటి అవస్థలను గుర్తు తెచ్చుకున్న అవ్వాతాతలు
- వలంటీర్లు లేకుండా తొలిసారిగా పింఛన్ల పంపిణీకి చర్యలు

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ బుధవారం జిల్లాలో ప్రారంభమైంది. దాదాపు నాలుగున్నరేళ్ల తరువాత వలంటీర్‌లు లేకుండా ఈ కార్యక్రమం మొదలైంది. ఫలితంగా మండుటెండల్లో అవ్వాతాతలు ఇతర కేటగిరీలకు చెందిన వారు పింఛన్ సొమ్ముకోసం సచివాలయాలకు వెళ్లారు.

మధ్యాహ్నం నుంచి పంపిణీ...
వరుస సెలవుల కారణంగా సచివాలయ సిబ్బంది బుధవారం బ్యాంకులకు వెళ్లి, పింఛన్‌లకు సంబంధించిన నగదును తెచ్చుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నిబంధనల ప్రకారం పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టారు. సచివాలయాలకు వచ్చిన వారికి పింఛన్ నగదును అందజేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,68,179 పింఛన్లకు గాను మొత్తం రూ.79,31, 26,000 నగదును పంపిణీ చేయాల్సి ఉంది.

వలంటీర్‌లను తొలగించడంతో అవస్థలు
ఎన్నడూ లేని విధంగా ఈ వేసవి నిప్పుల కుంపటిలా మారింది. ఎండల ధాటికి యుక్త వయసులో ఉన్నవారు సైతం వడగాలులకు ఉడికిపోతున్నారు. అలాంటిది పింఛన్ల కోసం వృద్ధులు, వయోభారంతో ఉన్నవారు సంబంధిత సచివాలయాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరి కొందరు ఆటోల్లో వచ్చి వెళ్లడానికి రూ.150 వరకు ఖర్చు చేశారు. వలంటీర్‌లు లేకుంటే ఇబ్బందులు తప్పవనే చర్చ సాగింది.

గతం గుర్తుకొచ్చింది...
గత తెలుగుదేశం పార్టీ పాలనలో పింఛన్ కోసం వృద్ధులు, ఇతర కేటగిరీలకు చెందినవారు ఎన్నో అవస్థలు పడ్డారు. కొంతమంది పింఛన్ల పంపిణీ కేంద్రం వద్ద గంటల తరబడి ఉండడంతో సొమ్మసిల్లిపోయేవారు. మరికొందరు పింఛన్ కోసం పలుమార్లు తిరగలేక ఇబ్బందులు పడ్డారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న వారి పరిస్థితి దారుణంగా ఉండేది. తాజాగా వలంటీర్లను విధుల నుంచి తప్పించడంతో ప్రభుత్వం పింఛన్ల పంపిణీ ప్రక్రియలో రెండు విధానాలను చేపట్టింది. అందులో భాగంగా పింఛన్ కోసం సమీపంలోని సచివాలయానికి వెళ్లాల్సి రావడంతో వృద్ధులు గత అనుభవాలను గుర్తుకు తెచ్చారు.

టీడీపీకి ఉసురు తగులుతుంది



నా పేరు కాంతమ్మ. నేను అంకాలమ్మపేటలో నివసిస్తున్నాను. ప్రతినెల వలంటీర్లు తెల్లవారకముందే తలుపుతట్టి రూ.3వేలు ఫించన్ అందజేసేవారు. తెలుగుదేశం పార్టీ వలంటీర్లపై కోర్టులో కేసు వేశారు. దీంతో పింఛన్ల కోసం మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మా ఉసురు టీడీపీకి తగులుతుంది. – కాంతమ్మ, ఫించన్ లబ్ధిదారురాలు,పులివెందుల

తెల్లవారకముందే పింఛన్ ఇచ్చేవారు



ప్రతీనెల 1వ తేదీ తెల్లవారకముందే ఇంటి వద్దనే పింఛన్ ఇచ్చేవారు. ఇంతకాలం పింఛన్‌ల కోసం ఎటువంటి ఇబ్బందులు పడలేదు. పింఛచన్ డబ్బుల కోసం సచివాలయాల దగ్గరికి ఇంకా ఎన్ని రోజులు వెళ్లాలో అర్థం కావడం లేదు. అసలే వేసవికాలం, మండుటెండలో వృద్ధులు బయటికి రావాలంటేనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వస్తున్నారు. – వెంకటలక్షుమ్మ, పింఛన్ లబ్ధిదారురాలు

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది



ఊత కర్ర, భార్య సహాయంతో వస్తున్న గుర్రయ్య

పక్షవాతంతో కాలు, చేయి పడిపోయింది. చేతి కర్ర ఉండి తోడు మనిషి ఉంటే తప్ప నడవలేను. మూడేళ్లుగా ఫించన్‌ను ప్రతి నెల 1వ తేదీన ఉదయాన్నే వలంటీర్ తలుపుతట్టి పింఛన్ సొమ్మును అందజేసేవాడు. ఆ డబ్బులు అందితేనే నా మందులకు, ఇంటి ఖర్చుకు ఉపయోగించుకుంటాను. టీడీపీ నేతలు కోర్టుకు వేసి వాలంటీర్ల ద్వారా మాకు పింఛను ఇవ్వకుండా చేశారు. నేను ఊతకర్ర పట్టుకొని మా భార్య సహాయంతో అగసాట్లు పడతా సచివాలయానికి వచ్చాను. మమ్మలను ఇబ్బంది పెట్టిన చంద్రబాబు నాయుడుకు మా ఉసురు తప్పకుండా తగులుతుంది. –గంధం గుర్రయ్య, దిగువపేట , సిద్దవటం

ఆయాసంతో అల్లాడుతూ వచ్చా



నాగమ్మను సచివాలయానికి తీసుకు వస్తున్న గ్రామస్తులు

వలంటీర్లు పింఛను ఇంటి వద్దకు వచ్చి ఇస్తున్నప్పుడు సంతోషంగా తీసుకునే వాళ్లం, ఇప్పుడు ఆ తెలుగుదేశం వాళ్లు వలంటీర్లను లేకుండా చేయడంతో పింఛన్ కోసం ఎండకు ఆయాస పడుతూ వచ్చి పింఛను తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలా అయితే బతకడం చాలా కష్టం, జగనే ముఖ్యమంత్రిగా ఉంటే బాగుంటుంది. – నల్లబల్లి నాగమ్మ, బుగ్గలేటి పల్లి, చింతకొమ్మదిన్నె మండలం

13 నుంచి పీఓలకు శిక్షణ

- నియోజకవర్గ పరిధిలోనే మహిళలకు విధులు
- జిల్లాలో 15 వేల ఎన్నికల సిబ్బంది
- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: పనిచేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే మహిళా ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయిస్తామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 15 వేల మంది ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, హెచ్‌ఆర్ పాలసీ నియామక ఉద్యోగులకు మాత్రమే ఎన్నికల విధుల్లో నియమిస్తామని చెప్పారు. ఈనెల 13, 14 తేదీల్లో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి విడత శిక్షణ నిర్వహిస్తామని, మే నెలలో రెండవ విడత శిక్షణ ఉంటుందన్నారు. ఈవీఎంలు సరిపడా ఉన్నాయని, ఈనెల 14, 15 తేదీల్లో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపడతామన్నారు. వాణిజ్య ప్రకటనలకు సంబంధించి అభ్యర్థులకు రేటింగ్‌కార్డు ఇస్తామన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతులు తీసుకోవాలన్నారు. నాయకుల ర్యాలీలు, స్టార్ క్యాంపెనర్స్ రాక, రోడ్‌షో లాంటి వాటికి ముందస్తు అనుమతులు తీసుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ప్రవర్తనా నియమావళి ఎవరైనా ఉల్లంఘించినట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. వ్యయ పర్యవేక్షణ కోసం 12 ప్రత్యేక టీములు ఏర్పాటు చేశామన్నారు. షాడో అబ్జర్వేషన్ కూడా 24 గంటలు కొనసాగుతుందన్నారు. సీజర్ మేనేజ్‌మెంట్ పారదర్శకంగా జరుగుతుందన్నారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే సి–విజల్ యాప్, కమాండ్ కంట్రోల్ రూము, టోల్ ఫ్రీ నెంబరు 1950కి ఫోన్ చేస్తే ఫోన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భరత్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ), ప్రతాప్‌రెడ్డి (టీడీపీ), కానుగ దానం (బీఎస్పీ), లక్ష్మణ్‌రావు (బీజేపీ), పాల్ సుధాకర్ (కాంగ్రెస్), శ్రీనివాసులు (ఆప్), మనోహర్ (సీపీఐ–ఎం), అధికారులు పాల్గొన్నారు.

6 నుంచి వార్షిక పరీక్షలు

- 1 నుంచి 8 వరకు సీబీఏ విధానంలో పరీక్ష నిర్వహణ
- 9వ తరగతికి పాత పద్ధతిలో పరీక్ష నిర్వహణ
- మండల కేంద్రాలకు చేరిన ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్‌షీట్లు



డీసీఈబీలో పెట్టెల్లో ప్రశ్నపత్రాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఈ నెల 6 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు ఈనెల 6 నుంచి 16 వరకు, 6 నుంచి 9వ తరగతులకు 6 నుంచి 19 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందులో 1 నుంచి 6వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్న 12 గంటల వరకు, అలాగే 6,7,8 తరగతులకు కూడా 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 9వ తరగతికి మాత్రం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పశ్నాపత్రాలను కడప డీసీఈబీ నుంచి మండల కేంద్రాలలోని ఎమ్మార్సీలకు తరలించి ట్రంకు పెట్టెలో భద్రపరిచారు. సంబంధిత పరీక్షలను జిల్లావ్యాప్తంగా 3,32,314 మంది విద్యార్థులు ఈ పరీక్షలను రాయనున్నారు.

బైలింగ్విష్ విధానంలో ప్రశ్నాపత్రం...
సీబీఏ విధానంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రం బైలింగ్విష్(ద్విబాష) విధానంలో ఉంటుంది. ఇప్పటివరకు ఇంగ్లిష్ మీడియం వారికి ఆంగ్లంలో, తెలుగు మీడియం వారికి తెలుగులో ప్రశ్నాపత్రం ఇస్తున్నారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను బైలింగ్విస్ పద్ధతిలో ముద్రించిన విద్యాశాఖ ప్రశ్నాపత్రాన్ని కూడా బైలింగ్విస్‌లో రూపొందించారు.

ఎంఈఓలు చేయవలసిన పనులు...
ప్రశ్నాపత్రాలను, ఓఎంఆర్‌లను పాఠశాల వారి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అందచేయాలి. పరీక్ష ప్రారంభం రోజున స్ట్రాంగ్ రూంలోని ప్రశ్నాపత్రాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించాల్సి ఉంటుంది.
- 6 నుంచి 9వ తరగతి వరకు ప్రశ్నాపత్రాలను అన్ని పాఠశాలలకు ఎమ్మార్సీల నుంచి మాత్రమే ప్రతి రోజు టైమ్ టేబుల్ అనుసరించి పరీక్షకు గంట ముందు ఇవ్వాలి
- పరీక్షల అనంతరం అన్ని పాఠశాలల నుంచి ఓఎంఆర్ షీట్స్ సేకరించి కన్సాలిడేషన్ లిస్టును తయారు చేసి స్కానింగ్ నిమిత్తం 20వ తేదీన డీసీఈబీ కార్యాలయానికి పంపాలి

ప్రమోషన్ లిస్టు ప్రదర్శించాలి...



పరీక్షలు 16వ తేదీకి ముగుస్తాయి. 18న మూల్యాంకనం పూర్తి చేసి ప్రమోషన్ లిస్టులను తయారు చేయాలి. 22వ తేదీ తల్లితండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిని తెలియచేయాలి.– శంకరయ్య, డీసీఈబీ సెక్రటరీ

కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణ



సమ్మెటివ్–2 పరీక్షల నిర్వహణను చాలా కట్టుదిట్టంగా నిర్వహించేలా అన్ని సూచనలు, సలహాలను ఇచ్చాం. ప్రశ్నాపత్రం లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలను జారీ చేశాం. – అనురాధ, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

ఉపాధికి మరింత ఊతం

- ఏప్రిల్ 1 నుంచి పెరిగిన కనీస వేతనం
- రూ. 272 నుంచి రూ. 300కు కనీస వేతనం పెంపు
- ఈ ఆర్థిక సంవత్సరం నుంచే అమలు
- ఈ ఏడాది కూడా 80 లక్షల పనిదినాల లక్ష్యం



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

కడప సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి మరింత ఊతమిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధి కూలీలకు కనీస వేతనం పెంచుతూ వారి ఆర్థికాభివృద్ధికి దారులు పరిచింది. సగటు వేతనం రోజుకు రూ.272 నుంచి రూ.300లకు పెంచడంతో వేతన జీవులు పనులకు వచ్చేందుకు మరింత ఆసక్తి కనబరిచే అవకాశం ఏర్పడింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 72 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా, అదనంగా మరో 7 లక్షల పనిదినాలు పెంచినప్పటికీ దాదాపు లక్ష్యానికి చేరువగా పనులు నిర్వహించారు. రూ. 334.76 కోట్లు గతేడాది బడ్జెట్ కాగా, దాదాపు బడ్జెట్‌కు దగ్గరగా పనులు చేపట్టడం విశేషం. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మొదలైంది. ప్రస్తుతం చేయబోయే పనులన్నీ పెరిగిన వేతనంతోనే నిర్వహించనున్నారు. వేతన జీవులకు, మెటీరియల్‌కు కలిపి రూ. 400 కోట్లుగా బడ్జెట్ నిర్ణయించారు. ఇందులో కూలీలకు రూ. 240 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. మెటీరియల్‌కు సంబంధించి రూ. 160 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాదిలో 80 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్ణయించారు.

వేతన పెంపుతో ఆర్థికాభివృద్ధి
ఉపాధి హామి పథకంలో వేతన పెంపువల్ల కూలీల ఆర్థికాభివృద్ధికి అడుగులు పడే అవకాశం ఉంది. రూ. 272 నుంచి రూ. 300కు సగటు వేతనాన్ని పెంచారు. ఈ నేపథ్యంలో వేసవికాలమైనందున వ్యవసాయ పనులు లేకపోవడంతో పనులకు వచ్చేందుకు మరింత ఆసక్తి కనబరిచేందుకు అవకాశం కలిగింది.

మొత్తం జాబ్‌కార్డులు :	2,29,875
యాక్టివ్ జాబ్ కార్డులు :	1,96,277
అందులో పనిచేసే కూలీలు:	3,34,740
ఈ ఏడాది పనిదినాల లక్ష్యం:	80 లక్షలు
కూలీల వేతనానికి:	240 కోట్లు
నిర్మాణాత్మక పనులకు : రూ.	160 కోట్లు
మొత్తం బడ్జెట్ : రూ.	400 కోట్లు
సగటు వేతనం: రూ.	272-300కు పెంపు

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత
జిల్లాలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. ప్రధానంగా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఖండిత కందకాలు, పారంపాండ్స్, చెరువుల పునరుద్ధరణ, ప్లాంటేషన్, కాలువల్లో పూడికతీత తదితర నీటి సంరక్షణ పనులను చేపడుతున్నారు. నిర్మాణాత్మక పనుల విషయానికి వస్తే గ్రామ సచివాలయాలు, బల్క్‌మిల్క్ సెంటర్లు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు, లైబ్రరీలు, సిమెంటు రోడ్లు, తదితర పనులు నిర్వహిస్తున్నారు.

పనుల వద్ద జాగ్రత్తలు
ఉపాధి హామీ పనులు నిర్వహించే ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వేకువజామునే పనులకు వెళ్లి ఎండ తీవ్రత కాకమునుపే ఇంటికి చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. వడదెబ్బకు గురికాకుండా సమీప ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీల నుంచి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించారు. అంతే కాకుండా ప్రథమ చికిత్స పెట్టెలను అందుబాటులో ఉంచుతున్నారు. సేద తీరేందుకు గుడారాలు కూడా ఏర్పాటు చేసుకునేందుకు తోడ్పాటు అందిస్తున్నారు.

మూడో రోజూ కొనసాగింపు
కడప ఎడ్యుకేషన్: కడప మున్సిపల్ హైస్కూల్ నిర్వహిస్తున్న పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం ప్రశాంతంగా సాగుతోంది. మూల్యాంకనం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన 1,96,635 సమాధాన పత్రాలకుగాను 29,335 పత్రాలకు మూల్యాంకనం జరిగిందని డీఈఓ, క్యాంపు అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లె జవహర్ రోజ్‌గార్ భవనం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చని.. అతడి చేతిపై ఎం. రాణి అని పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తుపడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు.

రైలు పట్టాలపై..



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎర్రగుడిపాడు–కమలాపురం రైల్వేస్టేషన్ మధ్యలో గల రైలు పట్టాలపై ఒక గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని బుధవారం కడప రైల్వే సీఐ బి.నాగార్జున తెలిపారు. మృతుడికి 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని గర్తించిన వారు రైల్వే సీఐ 94406 27398, రైల్వే ఎస్‌ఐ 94409 00811 నెంబరులో సంప్రదించాలన్నారు.

రూ. 10 లక్షలు సీజ్

కొండాపురం : మండలంలోని కె.సుగుమంచిపల్లె చెక్ పోస్ట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా రూ.10 లక్షలు నగదు తీసుకెళుతుండగా సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ జె. చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. యర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామానికి చెందిన శ్రీదేవి అనంతపురం నుంచి ప్రొద్దుటూరుకు కారు లో వెళుతుండగా తనిఖీలో రూ. పది లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



గోపవరం : మండలంలోని చెన్నవరం దళితవాడకు చెందిన గుడిపాటి అచ్చమ్మ అనే వృద్ధురాలు అదృశ్యమైంది. మార్చి 28వ తేదీ నుండి వృద్ధురాలు అచ్చమ్మ కనిపించలేదు. అచ్చమ్మకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరంతా రోజూ వారి కూలీగా పనులకు వెళుతున్నారు. ఇంటి వద్దే ఉన్న వృద్ధురాలు ఉన్నపలంగా కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు గత వారం రోజులుగా చుట్టుపక్కల గ్రామాల్లో వెతుకులాడుతున్నారు. వృద్ధురాలు కనిపించని విషయం పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. వృద్ధురాలు ఆచూకీ కనిపిస్తే 93816 12153 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఓటరు నమోదుకు త్వరపడాలి

ఆఖరు గడువు ఈనెల 15



కడప సెవెన్‌రోడ్స్ : పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయాలనుకుంటున్నారా? అయితే ఓటరుగా నమోదు కాలేకపోయామని బాధపడుతున్నారా? మీకు ఆ చింత అవసరం లేదు. ఓటరుగా నమోదు కావడానికి ఈనెల 15వ తేది వరకు భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా ప్రకటించారు. 18 సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులు ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉంటే ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నది ఈసీఐ ఉద్దేశ్యం. గడువు సమీపిస్తోంది. మరి ఇంకెందుకు ఆలస్యం...

- అర్హులైన పౌరులు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ఇంకా అవకాశం ఉంది. నేషనల్ ఓటర్స్ సర్వీసు పోర్టల్‌ను ఆశ్రయించాలి. డబ్ల్యు. డబ్ల్యు. డబ్ల్యు.ఎన్‌వీఎస్‌పీ. ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫారం–6 భర్తీ చేయాలి. ఎక్కడ ఎన్‌రోల్ కావాలనుకుంటున్నారో ఆ పోలింగ్ కేంద్ర పరిధిలో సాధారణ నివాసం ఉండాలి. ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇటీవల తీసిన పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫోటో జతపరచాలి. అలాగే ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, బ్యాంకు పుస్తకం, రేషన్‌కార్డు, తాజాగా చెల్లించిన వాటర్, టెలిఫోన్, ఎలక్ట్రిసిటీ, గ్యాస్ కనెక్షన్ల బిల్లులలో ఏదో ఒకటి రెసిడెన్స్ ప్రూఫ్‌గా సమర్పించాల్సి ఉంటుంది.
- 18 ఏళ్లు నిండిన పౌరులు మాత్రమే అర్హులు గనుక తమ వయస్సును నిర్ధారించే బర్త్ సర్టిఫికెట్, స్కూలు లీవింగ్ సర్టిఫికెట్, టెన్త్ లేదా ఇంటర్ మార్కుల జాబితాల్లో ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. ఇదే కాకుండా ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న వ్యక్తులు గుగూల్ ప్లే స్టోర్‌లో నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో ఫారం–6 భర్తీ చేసి అవసరమైన డాక్యుమెంట్లను జతపరచాలి. ఓటరు నమోదు కోసం తాము సమర్పించిన దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునేందు కోసం ఎన్నికల కమిషన్ హెచ్‌టీటీపీఎస్ ://ఎలక్టోరల్‌సెర్చ్.ఇన్/లోకి వెళ్లి పరిశీలించాలి.

ఆఫ్‌లైన్‌లోకూడా దరఖాస్తు సమర్పించే అవకాశం ఉంది. తమ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లేదా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (తహసీల్దార్) కార్యాలయాలకు వెళితే ఫారం–6 దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయి. రెండు కాపీలను భర్తీచేసి, కావాల్సిన డాక్యుమెంట్లు జతపరిచి వారికి సమర్పించాల్సి ఉంటుంది. అదీ కాకపోతే బూత్ లెవెల్ అధికారులకు ఫారం–6 సమర్పించినా సరిపోతుంది. ఇప్పుడు నమోదయ్యే ఓటర్ల పేర్లు ముద్రించి ప్రత్యేక జాబితాను ప్రభుత్వం విడుదల చేస్తుంది.

పేరు చెక్ చేసుకోండిలా..

తమ ఓటు ఎప్పటినుంచో ఉందని చాలామంది ధీమాతో ఉంటారు. తీరా పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వెళితే ఉండకపోవడంతో చేసేది లేక నిరాశగా వెనుదిరగాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచిస్తున్నారు. ఇందుకు ఓటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి ఇప్పుడే చెక్ చేసుకోవాలి. ఒకవేళ పేరు లేకపోతే ఆలస్యం లేకుండా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నాణ్యమైన ఎరువులు అందించడమే లక్ష్యం

వేంపల్లె : నాణ్యమైన ఎరువులు, విత్తనాలతో పాటు పురుగుమందులు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వేద ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం వేంపల్లి పట్టణంలో రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ బ్రాంచ్ ప్రారంభోత్సవం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ దేశీయ విదేశీ కంపెనీలతో సత్సంబంధాలు పెట్టుకుని వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయనున్నట్లు తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడుగురిపై కేసు నమోదు

పెండ్లిమర్రి : మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనువాసులు(33) అను వ్యక్తి మంగళవారం కొత్తపల్లె గ్రామ సమీపంలోని పొలాల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భూ తగాదాల కారణంగా పక్క పొలం ఉన్న వ్యక్తులు దాదాపు ఏడుగురు కలిసి హత్య చేశారని మృతుని కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప రూరల్ సీఐ నాగరాజు తెలిపారు.

80 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన మైనార్టీ నాయకులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పార్టీలో చేరిన నాయీ బ్రాహ్మణులతో ఉప ముఖ్యమంత్రి



వీఎన్ పల్లె : పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు పి. గురుస్వామి, వృత్తి సంఘ విభాగం అధ్యక్షుడు జి. సురేష్ బాబు ఆధ్వర్యంలో 80 నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఐటీఐ సర్కిల్ సమీపంలోని కళ్యాణ మండపంలో నిర్వహించిన నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సభలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించిన నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానని బెదిరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఎస్. సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చాక్లెట్ గౌస్, షఫీ, మున్నా, రమేష్‌రెడ్డి, జహీర్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక..

కడప నగరంలోని సాయిపేటలో తెలుగుదేశం పార్టీ నుంచి 50 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం సాయంత్రం టీడీపీ నేత ఖలీల్ ఆధ్వర్యంలో చేరిన వారందరికీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ఖలీల్ మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, నగర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, అజ్మతుల్లా, బసవరాజు, చాంద్‌బాషా, మియ్యా, రిజ్వాన్, రమేష్‌రెడ్డి, కె. కొండయ్య, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచుతో పాటు 70 కుటుంబాలు చేరిక

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 70 కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సమక్ష్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారు మాజీ సర్పంచు పెద్ద ఓబులేసు, ఓబులేసు, రెడ్డెయ్య, వెంకటలక్షుమ్మ, బుజ్జమ్మ, రేవతి, బ్రహ్మయ్య, ఆనంద్, శివ, నారాయణ, భద్రి, శ్రీనివాసులు, మురళి, గోపాల్, వెంకటక్రిష్ణ, గోవిందు వారితో పాటు మరో 43 కుటుంబాలవారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచు నరేష్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాసుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు మేలు చేసింది వైఎస్ కుటుంబమే

మైదుకూరు : ముస్లింలకు మేలు చేసింది కేవలం వైఎస్ కుటుంబం మాత్రమేనని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు పట్టణంలోని 14వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నుంచి 100 కుటుంబాలకు చెందిన ముస్లిం మైనారిటీలు వైఎస్సార్‌సీపీలో చేరారు. 14వ వార్డు టీడీపీకి చెందిన పెద్ద జమాల్ వలి, ముస్తఫా, ఖాదర్‌బాషా, ఖలందర్, షరీఫ్, బేల్దారి కమాల్, అల్తాఫ్, హసేన్, మహబూబ్ బాషా, బాబా మియా, దస్తగిరి, నూరున్, జమీల, మహబూచాన్, అక్తర్ తదితర 100 కుటుంబాల వారు వార్డు ఇన్‌చార్జి ఖాదర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, బీ.మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, వనిపెంట సర్పంచ్ గౌస్ లాజం, ఎంపీటీసీ ఇర్షాద్, షౌకత్, ముజాఫర్, నాయిబ్ రసూల్, గౌస్, సన్న శీనురావు, మామిళ్లపల్లె దస్తగిరి, వీరభద్రుడు పాల్గొన్నారు.

ఈద్గా ప్రహరీ పరిశీలన ..

పట్టణంలో ఈద్గాకు నిర్మించిన ప్రహరీని బుధవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

సొంత గూటికి సిద్దారెడ్డి

మైదుకూరు : కొద్ది రోజుల కిందట ప్రొద్దుటూరులో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి బంధువు, మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు మండలం నక్కలదిన్నెకు చెందిన శెట్టిపల్లె సిద్దారెడ్డి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. సిద్దారెడ్డికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువా వేసి తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రలోభపెట్టి టీడీపీ వారు వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలను చేర్చుకుంటున్నారని విమర్శించారు. పార్టీపై అభిమానంతో మనస్ఫూర్తిగా చేరాలి కానీ, ప్రలోభాలతో లొంగదీసుకోవాలని చూస్తే సత్ఫలితాలను ఇవ్వదని పేర్కొన్నారు. శెట్టిపల్లె సిద్దారెడ్డి మాట్లాడుతూ తనను ప్రలోభపెట్టి చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి, తనకు ఇష్టం లేకపోయినా కండువా వేశారని ఆరోపించారు. తాను వైఎస్ కుటుంబాన్ని, తన పెదనాన్న రఘురామిరెడ్డి, అన్నయ్య శెట్టిపల్లె నాగిరెడ్డిలను వదిలి వెళ్లే ప్రసక్తే లేదని అన్నారు. చంద్రబాబు సమక్షంలో చేరిన తమ బంధువులు కూడా తిరిగి వస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, బీ.మఠం మండల జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, చాపాడు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పాల్గొన్నారు.



శెట్టిపల్లె సిద్దారెడ్డిని వైఎస్సార్‌సీపీలో చేర్చుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

నానుబాలపల్లెలో...

మైదుకూరు మున్సిపాలిటీ నాలుగవ వార్డు పరిధిలోని నానుబాలపల్లెకు చెందిన పలువురు బుధవారం తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన పలువురిని మంగళవారం టీడీపీ నేతలు ఆ పార్టీలో చేర్చుకున్నారు.

అయితే తమను ప్రలోభపెట్టడం వల్లే టీడీపీలో చేరామన్నారు. సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును మరిచిపోలేక తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వచ్చామని వారు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఎద్దుల ఏసోబు, సుకుమార్, బొజ్జ రాజు, చిట్టిబాబు, తిరుమలయ్య తదితరులు బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామదాసు, గోశెట్టి లక్షుమయ్య సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

రేపు కల్యాణ్ షోరూం ప్రారంభం

కడప కార్పొరేషన్ : సరికొత్తగా డిజైన్ చేయబడిన కల్యాణ్ షోరూం శుక్రవారం ప్రారంభం కానుంది. అధునాతనంగా తీర్చిదిద్దిన ఈ అప్‌డేటెడ్ షోరూంను ప్రముఖ టాలీవుడ్ నటి శ్రీలీల ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 5వ తేది మధ్యాహ్నం 3 గంటలకు షోరూం ప్రారంభం ఉంటుందని.. ప్రారంభోత్సవ సందర్భంగా కల్యాణ్ జ్యూవెలర్స్ విస్తృతమైన ఆఫర్లు అందించనుందని నిర్వాహకులు తెలిపారు. అన్ని ఉత్పత్తులపై మేకింగ్ చార్జీలపై 25 శాతం డిస్కౌంటుతోపాటు అక్షయ తృతీయ కోసం బుకింగ్స్‌ను కూడా ప్రారంభించనున్నారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు విద్యాశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత గతేడాది కంటే రెండు మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా ఉంది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో బుధవారం నుంచి వాటర్ బెల్స్‌ను అమల్లోకి తీసుకొచ్చామని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. విద్యార్థులు నీటిని తాగేందుకు వీలుగా వారికి గుర్తు చేస్తూ రోజులో మూడు సార్లు వాటర్‌బెల్‌ను మోగించాలని సూచించారు. ఇందులో ఉదయం 8.45 గంటలకు, 10.05 గంటలకు తిరిగి 11.50 గంటలకు వాటర్ బెల్‌ను మోగించి విద్యార్థులందరు నీటిని తాగే విధంగా చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు.

కలుషిత నీటిని తాగి 27 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెల వద్ద బాధితులు, వైద్యుడు

చెన్నూరు : చెన్నూరు మండలం బుడ్డాయపల్లె సమీపంలోని ఇటుకల బట్టి వద్ద బుధవారం ఉదయం కలుషిత నీరు తాగి 27 గొర్రెలు మృతి చెందాయి. పెండ్లిమర్రి మండలం ఓపరాసుపల్లెకు చెందిన గంగిరెడ్డి, బాల గంగయ్య, వడ్డెరపు చిట్టిబాబు, వీరాంజనేయులు, గంగరాజు, ప్రసాద్‌లు తమ గొర్రెలను చెన్నూరు చుట్టుపక్కల పొలాలలో మేపుకొనేందుకు వచ్చారు. రోజులాగే అక్కడ వారు గొర్రెలను మేపునకు తోలుకొచ్చారు. అయితే కొన్ని గొర్రెలు పక్కనే ఉన్న ఇటుకల బట్టి వద్ద నీటిని తాగాయి. ఆ నీటిని తాగిన గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గమనించిన గొర్రెల కాపర్లు ఇటుకల బట్టి యజమానితో గొడవకు దిగారు. నీటిలో యూరియా కలిపానని.. అయినా గొర్రెలను ఇక్కడి నీటిని ఎందుకు తాపించారని బట్టి యజమాని వారితో అన్నారు. కాగా ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ సంఘటన స్థలానికి వెళ్లి గొర్రెల కాపరులతో మాట్లాడారు. పశువుల డాక్టర్ ఉపేంద్రకు, వీఆర్వో వెంకటసుబ్బయ్యకు, పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. వెటర్నరీ డాక్టర్ ఉపేంద్ర మాట్లాడుతూ చనిపోయిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించి తగిన నమూనాలను ల్యాబ్ కు పంపిస్తామన్నారు. అవి యూరియా నీరు తాగడం వల్ల చనిపోయాయా లేక ఇంకే కారణం ఉందా అనేది తెలుస్తుందన్నారు. రాష్ట్ర ఆటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, రామనపల్లి ఉప సర్పంచ్ పుత్తా వేణుగోపాల్ రెడ్డి కూడా ఘటనా స్థలికి వెళ్లి మృతి చెందిన గొర్రెలను పరిశీలించి, గొర్రెల కాపరులతో మాట్లాడారు. కాగా గంగిరెడ్డి కి చెందిన ఐదు గొర్రెలు, బాల గంగయ్య కు చెందిన 8, గంగరాజు చెందిన 5 , ప్రసాద్‌కు సంబంధించి 3, వడ్డేపు చిట్టి బాబుకు సంబంధించి మూడు, వీరాంజనేయులుకు చెందిన మూడు గొర్రెలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు

లారీ డ్రైవర్ మృతి



అశోక్ మృతదేహం

బద్వేలు అర్బన్ : తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ లారీడ్రైవర్ బుధవారం పట్టణంలోని మైదుకూరు రోడ్డులో మృతిచెందాడు. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన అశోక్ (32) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం బద్వేలుకు వచ్చేసరికే లారీ మరమ్మత్తులకు గురికావడంతో అప్పటి నుండి అక్కడే ఉంటున్నాడు. అయితే మధ్యాహ్నం సమయంలో మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే మృతుని బంధువులకు కూడా సమాచారం అందించారు. అతిగా మద్యం సేవించడం ద్వారా గాని, వడదెబ్బ కారణంగా గాని మృతిచెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

ప్రాథమిక అవసరాలలో విద్యుత్ ఒక భాగం

- అత్యవసర పనులకు మాత్రమే విద్యుత్ ఆపాలి
- ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ ఎస్‌ఈ ఎస్. రమణ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రమణ

కడప కార్పొరేషన్ : మనిషి ప్రాథమిక అవసరాలలో విద్యుత్ ఒక భాగమైందని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఎస్. రమణ అన్నారు. బుధవారం స్థానిక కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున చిన్నపాటి అంతరాయాలను కూడా సహించే స్థితిలో ప్రజలు లేరన్నారు. అందువల్ల విద్యుత్ లైన్లను ట్రాన్స్‌ఫార్మర్లను ముందుగానే మరమ్మతులు చేసుకోవాలని, అత్యవసర పనులకు మాత్రమే విద్యుత్‌ను ఆపాలని ఆదేశించారు. నీటి పథకాల పనులను అత్యధిక ప్రాధాన్యతతో యుద్ధ ప్రాదిపదికన పూర్తి చేయాలన్నారు. లోఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా అవసరమైనన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లలో జాప్యం చేయవద్దని, అన్ని బకాయిలను సకాలంలో వసూలు చేయాలన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరి చేయాలని ఆదేశించారు. పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు, జేఈలు, కడప, పెండ్లిమర్రి, సీకేదిన్నె, వల్లూరు, చెన్నూరు మండలాల అధికారులు పాల్గొన్నారు.